వక్క.. ఉపాధి పక్కా

- మడకశిర నియోజకవర్గంలో భారీగా సాగు
- ఆరు నెలలపాటు కూలీలకు ఉపాధి

అమరాపురం: మడకశిర నియోజకవర్గంలో వక్క తోటలు కూలీలకు ఉపాధి కల్పిస్తున్నాయి. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఈ పంట సాగైంది. ఈ ప్రాంతంలోని కాలువల ద్వారా నీటి సౌకర్యం లేకున్నా బోరుబావులు తవ్వించి మరీ తోటలు పెడుతుంటారు. నియోజకవర్గవ్యాప్తంగా సుమారు 7 వేల ఎకరాల్లో పంట సాగు కాగా ఒక్క అమరాపురంలోనే 4 వేలకు ఎకరాలపైగా సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వక్కతోటల ద్వారా వందలాది మందికి ఉపాధి దొరకడం తోపాటు రైతులు ఆర్థికంగా ముందుకు సాగుతున్నారు.


గెల నుంచి వక్కలను వేరు చేస్తున్న కూలీలు


యంత్రం ద్వారా వక్క తోలును వేరు చేస్తున్న దృశ్యం

వందలాది మందికి ఉపాధి..

వక్కతోటల్లో ఆరు నెలల పాటు ఉపాధి పుష్కలంగా లభిస్తోంది. ముఖ్యంగా జూన్ మాసంలో వక్క కోతలు ప్రారంభమైతే డిశంబర్ వరకూ ఉపాధి దొరకుతోంది. దీంతో వందలాది మంది వక్క తోటల ద్వారా ఉపాధి పొందుతున్నారు. నిత్యం ఓ మగ కూలీకి ఉదయం నుంచి సాయంకాలం వరకు పని చేస్తే రూ.600 మహిళా కూలీలకు రూ.400 ఇస్తున్నారు. భోజనాలు, కాఫీ టీ ఖర్చులు అంతా రైతులదే. దీంతో కూలీలకు కుటుంబ పోషణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోతోంది. తోటలో కోత కోసినప్పటి నుంచి ఇంటికి తీసుకొచ్చి యంత్రంలో చిప్పను వేరు చేసి ఉడక బెట్టి, ఆరబెట్టే వరకు కూలీలు అవసరం ఉంది. దీంతో కూలీలకు డిమాండ్ ఏర్పడుతోంది.

కుటుంబ పోషణకు ఇబ్బంది లేదు



నేను వక్క తోటలకు పనులకు వెళుతున్నా. ఉదయం నుంచి సాయంకాలం వరకు పని చేస్తా రూ.600 కూలీ అన్ని ఖర్చులు పోనూ ఇస్తారు. దీంతో కుటుంబ పోషణకు ఎలాంటి ఇబ్బంది లేదు. వారే వచ్చి మమ్మల్ని పొలాలకు పిలుచుకుని పోతారు.

–శాంతకుమార్, కూలీ, అమరాపురం మండలం.

రోజూ పని ఉంటుంది



వక్క సీజన్ ప్రారంభమైతే రోజూ పని దొరుకుతుంది. ఒక్క రోజు కూడా ఇంటి వద్ద ఉండను. నేను తోటలకు వెళ్లి చెట్ల నుంచి వక్క గెలను కోస్తా. నాకు పచ్చి వక్కతో పాటు కూలీ ఇస్తారు. నాకున్న మూడు ఎకరాల్లో రెండకరాలు వక్క తోట సాగు చేశాను.

–శివకుమార్, కూలీ, తమ్మడేపల్లి, అమరాపురం మండలం.

డిమాండ్ ఎక్కువ



వక్క తోటల సాగు వల్ల కూలీలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఇంటి వద్ద ఉందామన్న రైతులు వదలరు. వక్క తోటల వల్ల ఉపాధికి ఇబ్బంది లేదు. అన్నం పెట్టి రూ.400 ఇస్తారు. ఇల్లు గడవడానికి ఎలాంటి ఇబ్బంది లేదు. వక్క తోటలు మమ్మల్ని ఆదుకుంటున్నాయి.

– సుధమ్మ, కూలీ, ఉదుగూరు, అమరాపురం మండలం.

క్లుప్తంగా

ఆలయాల్లో విద్యార్థుల శ్రమదానం


శ్రమదానంలో పాల్గొన్న విద్యార్థులు

పెనుకొండ: పట్టణంలోని పలు దేవాలయాల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గురువారం శ్రమదానం నిర్వహించారు. స్థానిక రామభద్రాలయం, కాశీ విశ్వేశ్వరాలయం, ఐముక్తేశ్వరాలయం తదితర ఆలయాల్లో ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు తొలగించారు. ప్రిన్సిపాల్ కేశవరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉర్దూ పోస్టులు ప్రకటించాలి

హిందూపురం: డీఎస్సీలో ఉర్దూ పోస్టులు ప్రకటించాలని నిరుద్యోగులు కోరారు. హిందూపురం ఉర్దూ భాషా అభివృద్ధి సంఘం ప్రెసిడెంట్ మహమ్మద్ రఫీక్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీలో ఉర్దూ ఖాళీలు భర్తీ చేయాలని డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. ఉర్దూ ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఎన్ని ఖాళీగా ఉన్నాయో చెప్పాలని కోరారు. కార్యక్రమంలో రఫియా, షమీరా, తస్లీమా, ఆలియా, ముహిసిరా, నీలుఫర్, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి విరాళం


వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ స్వామిని సన్మానిస్తున్న దృశ్యం

లేపాక్షి: స్థానిక పంచాయతీ కార్యాలయం పక్కన నూతనంగా నిర్మిస్తున్న ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి ఎంపీపీ వెంకటరత్నమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ స్వామి దంపతులు గురువారం రూ.5,00,16 విరాళంగా అందజేశారు. అలాగే వైస్ ఎంపీపీ అంజినరెడ్డి రూ.15,116, చోళసముద్రం గ్రామానికి చెందిన మాజీ టీడీపీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి రూ.16 వేలు, పి.జయచంద్ర రూ.5,116 చొప్పున అందజేశారు. విరాళాలు అందజేసిన దాతలను ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు సన్మానించారు.

చినుకు పడితే రోడ్డు చిత్తడే


మండల కేంద్రంలో బురదగుంటలా మారిన ప్రధాన రహదారి

రొద్దం: చినుకుపడితే చాలు రోడ్లు ఛిద్రమవుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల కేంద్రంలోని హిందూపురం–కలిపి కాలువల్ల కట్ట వద్ద ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి, వర్షపు నీరు నిలిచి బురదమైయమైంది. దీంతో ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు చేరి బురద గుంటలా మారుతుంది. బురదమయమైన రోడ్లలో నిత్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు వెళ్లాల్సి ఉంటుంది. పాఠశాల, కళాశాలకు వెళ్లాలంటే కనీసం నడిచి వెళ్లే పరిస్థితి కూడా లేదని విద్యార్థులు, అధ్యాపకులు వాపోతున్నారు. రోడ్డును బాగు చేయాలని విద్యార్థులు, గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రపంచ దేశాలు శాంతిని పాటించాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పెనుకొండ: ప్రపంచ దేశాలు శాంతిని పాటించాలని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూఎన్‌ఓ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. యుద్ధాల ద్వారా ప్రజలు జీవితాలు ఇబ్బందుల పాలవుతాయన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


సమావేశమైన డ్వాక్రా సంఘం సభ్యులు

పెనుకొండ: స్థానిక వెలుగు కార్యాలయంలో పట్టణంలోని డ్వాక్రా సంఘాల మహిళలు గురువారం పట్టణ సమాఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అశ్వర్థమ్మ, కార్యదర్శిగా భాగ్యమ్మ, సహాయ కార్యదర్శిగా ఫక్రూబీని ఎన్నుకున్నారు. అనంతరం భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.

తెరిపినివ్వని వర్షాలు


సోమిరెడ్డిపల్లిలో నేలకొరిగిన వరిని చూపుతున్న రైతు


మడకశిర మండలం తురుకువాండుపల్లిలో మొలకెత్తి నల్లగా మారిన వేరుశనగ కాయలను అరబెట్టిన దృశ్యం

మడకశిర: నియోజకవర్గంలో బుధవారం రాత్రి వర్షం కురిసింది. అమరాపురం మండలంలో 6.2, మడకశిర 24.6, అగళి 18.2, గుడిబండ 44.06, రొళ్ల మండలంలో 15.4 ఎంఎం చొప్పున వర్షం పడినట్లు అధికారులు తెలిపారు. నాలుగురోజులుగా విడవకుండా వర్షాలు కురుస్తుండటంతో మైనర్ ఇరిగేషన్ చెరువులకు జలకళ వచ్చింది. కుంటలు, చెక్‌డ్యాంలు నిండుకుండలా మారాయి.

30 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం

నియోజకవర్గంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఇప్పటి వరకు 30 ఎకరాల పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు స్థానిక ఏడీఏ కృష్ణమీనన్ తెలిపారు. అత్యధికంగా రొళ్ల మండలంలో పత్తి పంట దెబ్బతినిందన్నారు. మడకశిర మండలంలో 5 ఎకరాల వరి పంట దెబ్బతిన్నట్లు తెలిపారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని పేర్కొన్నారు.

చెరువులకు జలకళ

మడకశిరరూరల్: మండలంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మడకశిర, గుండుమల, వైబీహళ్లి తదితర చెరువులు జలకళ సంతరించుకున్నాయి. పొలంలో తొలగించిన వేరుశనగ కట్టె తడిసి మొలకెత్తిన కాయలను తొలగించి రైతు రవికుమార్ ఎండ బెట్టారు. దీంతో వ్యవసాయ బోరు బావుల్లో భూగర్భజలాలు పెరుతాయని రైతులు చెబుతున్నారు. ముందుగా రబీ పంటలను సాగు చేసుకోవడానికి ఈ వర్షం ఎంత గానో అనుకూల పడిందన్నారు.

గుడిబండ: ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు మండలవ్యాప్తంగా ఉన్న చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మండలంలో బుధవారం రాత్రి 44.06 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, రాగి, మిర్చి సాగు చేసిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అదుకోవాలని వారు కోరుతున్నారు.

కుళ్లిపోయిన పంటలు..

రొళ్ల: మండల వ్యాప్తంగా ఏడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి పత్తి, వేరుశనగ, వరి, మొక్కజొన్న ఇతరాత్ర పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. రొళ్ల మండలం జీజీ హట్టిలో రైతు చిత్తయ్య 1.5 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన పత్తి పంట చేతికి అందే సమయంలో తుపాన్ ప్రభావంతో పూర్తిగా కుళ్లిపోయి పనికి రాకుండా పోయింది. దీంతో ఖర్చులతో కలిపి సుమారు రూ.2.5 లక్షల వరకు నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపారు.


గుడిబండ సమీపంలో జోరుగా పారుతున్న వంక

దెబ్బతిన్న వరి

లేపాక్షి: మండలంలో గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వరి వర్షపు నీటితో నిండిపోయి, నేలకొరిగింది. మండల వ్యాప్తంగా బోరు బావుల కింద వరి సాగు చేసిన రైతులు భారీగా నష్టపోయారు. ఎకరా పొలంలో వరి సాగు చేసేందుకు రూ.35 వేల వరకూ ఖర్చు చేసినట్లు సోమిరెడ్డిపల్లికి చెందిన నరసింహారెడ్డి వాపోయాడు. సేద్యానికి పెట్టిన ఖర్చు కూడా దక్కదని బసవనపల్లి గ్రామానికి చెందిన రామాంజినప్ప ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వర్షాలకు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

పెన్నానదిలో ప్రవహిస్తున్న వరద

హిందూపురం: కర్ణాటకలో కురిసిన వర్షాలతో వరద నీరు పెన్నానదిలో ప్రవహిస్తూ ఆంధ్ర సరిహద్దు తూమకుంట చేరుతోంది. నది పరివాహక ప్రాంతంలో ఇసుక కోసం అడ్డు అదుపు లేకుండా గుంతలు తీశారు. ప్రస్తుతం నదిలో నీరు ప్రవహిస్తుండటంతో వాహనాలు వెళ్లకుండద జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి


పోటీలను పర్యవేక్షిస్తున్న వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు, ప్రిన్సిపాల్ ప్రగతి

హిందూపురం టౌన్: ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయి. సెల్‌ఫోన్‌లో వచ్చే వివిధ లింక్‌లను ఓపెన్ చేసి మోసాలకు గురికావద్దు. సైబర్ మోసాలపై అవగాహన అవసరమని వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు విద్యార్థినులకు సూచించారు. గురువారం పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి ఆధ్వర్యంలో సైబర్ నేరాలను అరికట్టడంలో యువత పాత్ర, వాతావరణ పరిరక్షణలో పోలీసులు ఎదుర్కొనే సవాళ్లు అనే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విజేతలకు త్వరలో జిల్లా పోలీస్ కార్యాలయంలో పోటీల్లో నిర్వహిస్తామన్నారు.

ఘనంగా ఐక్యరాజ్య సమితి దినోత్సవం..

కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, హిందీ విభాగం సంయుక్తంగా స్వచ్ఛత హీ సేవలో భాగంగా ఐక్యరాజ్య సమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి మాట్లాడుతూ.. దేశాల మధ్య సమన్వయం, ప్రపంచ శాంతి నెలకొల్పడంలో ఐక్యరాజ్య సమితి పాత్రను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు యశోదా దేవి, సరస్వతి, ఎన్ఎస్ఎస్ పీఓ రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, అధ్యాపకులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి నేలకూలిన ఇల్లు


కూలిన ఇంటి వద్ద బాధితులు

పెనుకొండ: పట్టణంలోని బోయగేరిలో నివాసం ఉంటున్న రామకృష్ణ ఇల్లు భారీ వర్షాలకు గురువారం తెల్లవారుజామున కూలిపోయింది. కొన్నేళ్లుగా అదే ఇంట్లో నివసిస్తున్న రామకృష్ణ కుటుంబ సభ్యులు భారీ వర్షాలు కురుస్తుండడంతో పక్కనే ఉన్న మరో ఇంట్లో నిద్రించారు. భారీ వర్షానికి తడిసిన ఇల్లు తెల్లవారుజామున నేలకూలింది.

తప్పిన పెను ప్రమాదం

సోమందేపల్లి: మండలంలోని సుద్దకుంటపల్లిలో ఉప్పర హనుమంతు ఇల్లు బుధవారం రాత్రి కూలిపోయింది. గ్రామానికి చెందిన ఉప్పర హనుమంతు, భార్య, కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. పైకప్పు దెబ్బతిన్న ఇల్లు.. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కుప్పకూలింది. అయితే ఇల్లు కూలుతుందేమోనని ముందుగానే గ్రహించిన కుటుంబ సభ్యులు.. బంధువుల ఇంట్లో ఉంటున్నారు.

ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ

హిందూపురం టౌన్: మండల పరిధిలోని కిరికెర సూపర్–ఏ మిల్లు వద్ద గురువారం ఏఐటీయూసీ జెండాను ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కిరికెర సూపర్–ఏ మిల్లు కార్మికులు హైకోర్టులో కేసు వేశారన్నారు. యాజమాన్యం కార్మికులకు మిల్లు మూసి వేసే సమయంలో సెటిల్మెంట్ చేయకుండా ఫ్యాక్టరీ మిషనరీ, భూములు అమ్మి ఇప్పటికే లేఅవుట్ వేశారన్నారు. అయితే కార్మికులు ఏర్పాటు చేసుకున్న జెండాను ఈ మధ్యనే కొందరు దుండగులు తొలగించడం జరిగిందన్నారు. అందులో భాగంగా నూతన జెండాను ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. ఈనెల 31న అన్ని ఏఐటీయూసీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నవంబర్ 10న పట్టణంలో జరిగే భారత కార్మిక చట్టాలు అనే జిల్లా స్థాయి సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు బాబు, మారుతి రెడ్డి, జబీ ఉల్లా, నరసింహమూర్తి, శివప్ప, రామాంజనమ్మ, నరసింహప్ప, లక్ష్మీనారాయణ, సమీవుల్లా, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


మౌనికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పరిగి: మండలంలోని ధనాపురం గ్రామానికి చెందిన మౌనిక అనే విద్యార్థి జాతీయ స్థాయి వాలీబాల్ ఎంపికైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 23 వరకూ హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి అండర్–7 బాలికల విభాగంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా తరపున ఎం. మౌనిక పాల్గొని జాతీయ స్థాయి అండర్–17 వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ మహేశ్‌దీపక్ గురువారం తెలిపారు. మౌనికను ప్రధానోపాధ్యాయుడు జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు అభినందించారు.

గుండెపోటుతో మాజీ కౌన్సిలర్ మృతి


నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

మడకశిర: పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ మనోహర్(41) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. మృతుడు ప్రముఖ పట్టణ వాల్మీకి సంఘం నాయకుడు. విషయం తెలుసుకున్న హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, పట్టణ వాల్మీకి సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు మనోహర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వరద బాధితులకు విరాళం


సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న హిందూపురం జోన్ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ సభ్యులు

హిందూపురం టౌన్: విజయవాడ వరద బాధితుల సహాయర్థం హిందూపురం జోన్ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ సభ్యులు రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసి చెక్కు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి రియాజ్, నందకుమార్, ప్రసాద్, మూర్తి, కరియన్న, గోవిందరాజులు, అఖిబ్ తదితరులు పాల్గొన్నారు.

పాంచజన్య పాఠశాల విరాళం..

విజయవాడ వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని పాంచజన్య పాఠశాల తరపున పాఠశాల అధ్యక్షుడు పీఎస్ శ్రీనివాసులు, కరస్పాండెంట్ నందకుమార్ రూ.2 లక్షలు విరాళం అందజేశారు. అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబుకు చెక్కు అందించారు.

వరద బాధితులను ఆదుకుంటాం


వరద ప్రవాహాన్ని వీక్షిస్తున్న జపానంద స్వామిజీ

పావగడ: తాలూకా సమీప సరిహద్దులోని అనంతపురం పట్టణంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలమైన అంబేడ్కర్ కాలనీ, ఇందిర కాలనీ, జగనన్న కాలనీతదితర ప్రాంతాలను స్థానిక రామకృష్ణాశ్రమాధిపతి స్వామి జపానంద ఇటీవల పరిశీలించారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో సుమారు వెయ్యి మంది వరద బాధిత కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా స్వామి జీకి అత్యంత సన్నిహితుడైన అనంతపురం జిల్లా కలెక్టర్ డా వినోద్‌కుమార్‌తో సహాయక చర్యలపై చర్చించారు. త్వరలోనే వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లు, దుస్తులు, వంట సామగ్రి తదితర వస్తువులు అందిస్తామని స్వామి జపానంద గురువారం విలేకరులకు తెలిపారు.

డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోండి


రైతులకు డ్రిప్ సామగ్రిని అందిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న డ్రిప్ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ ఏఓ నరసింహప్ప సూచించారు. గురువారం రైతులు గంగమ్మ, రంగప్ప, అనిల్‌కుమార్‌రెడ్డి, సునీల్ కుమార్‌రెడ్డి తదితరులకు డ్రిప్ పరికాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రిప్ వినియోగంతో తక్కువ నీటితో ఎక్కువగా పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. అర్హత ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'సెస్ వసూలులో లక్ష్యం సాధిస్తాం'

మడకశిర: మడకశిర వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో సెస్ వసూలు లక్ష్యం సాధిస్తామని కార్యదర్శి నాగేంద్ర గురువారం తెలిపారు. 2023–24లో సెస్ వసూలు లక్ష్యం రూ.20 లక్షలు కాగా రూ.20.50 లక్షలు వసూలు చేశామన్నారు. ఇక ఈ ఏడాది రూ.21 లక్షలు లక్ష్యం పెట్టగా ఇప్పటికే రూ.13 లక్షలు వసూలు చేశామని తెలిపారు. గడువులోగా లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ప్రారంభించడానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కొడికొండ–శిరా హైవేపై మడకశిర వద్ద మార్కెట్‌యార్డు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నామినేటెడ్ కౌన్సిలర్ల నియామకం


రామలింగ


గంగాధర

పావగడ: స్థానిక మున్సిపల్ నామినేటెడ్ కౌన్సిలర్లుగా రామలింగ(6 వ వార్డు), గంగాధర (2 వ వార్డు) మహమద్ రియాజ్‌ఉల్లా(5 వ వార్డు) , శ్రీనివాస ప్రసాద్ (17 వ వార్డు), రామాంజినప్ప (16 వ వార్డు)ను నియమించినట్లు మున్సిపల్ చైర్మన్ పీహెచ్ రాజేశ్ తెలిపారు. ఈ సందర్భంగా నామినేటెడ్ కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కి తమ వంతు కృషి చేస్తామన్నారు. తమను నామినేటెడ్ కౌన్సిలర్లుగా ఎంపిక చేసిన ఎమ్మెల్యే వెంకటేశ్, మున్సిపల్ చైర్మన్ రాజేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రాజకీయంగా ఎదగాలి

పెనుకొండ: విద్యార్థులు రాజకీయంగా ఎదగాలని విద్యార్థి సంఘం నాయకుడు శివకుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు.

ఆర్‌ఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నరసింహులు



రొద్దం: రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా బోయ నరసింహులు ఎంపికయ్యాడు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్‌ఈఎఫ్ కార్యాలయంలో రిజర్వేషన్ ఎంప్లాయిస్ సమావేశం జరిగింది. రిజర్వేషన్ వర్గాలకు చెందిన ఉద్యోగుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తామని నరసింహులు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హెచ్.రామచంద్ర, యండీ నాగభూషణ, అధ్యక్షుడు దాసరి ఆదినారాయణ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నట్లు వివరించారు.

హరేసముద్రం చేపల చెరువు వేలం రద్దు

మడకశిరరూరల్: హరేసముద్రం పెద్దచెరువులో చేపల పెంపకంపై గతంలో వేసిన వేలాన్ని రద్దు చేసినట్లు గ్రామ కార్యదర్శి అశ్వత్థ తెలిపారు. మళ్లీ కొత్తగా చెరువులో చేపల పెంపకానికి నిర్వహించే వేలం పాట తేదీని తర్వలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఉద్యోగుల సంఘం డైరెక్టర్‌గా జయలక్ష్మి



పావగడ: స్థానిక స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉద్యోగుల సంఘం తాలూకా డైరెక్టర్‌గా సూపర్‌వైజర్ ఏ జయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో ఆమె ఒక్కరే నామినేషన్ పత్రం దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రామకృష్ణప్ప గురువారం తెలిపారు. ఆమె ఎన్నిక పట్ల స్థానిక వాల్మీకి జాగృతి వేదిక మహిళా విభాగం తాలూకా అధ్యక్షురాలు అంబిక రమేష్ తదితర వాల్మీకి సంఘం నాయకులు హర్షం ప్రకటించారు.

నేడు జాబ్ మేళా

మడకశిర: స్థానిక ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో 8 కంపెనీలు పాల్గొంటాయని, టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు పెనుకొండ, హిందూపురం, బెంగళూరు తదితర ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. వేతనం రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు ఉంటుందని తెలిపారు. వివరాలకు 9966682246 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.